


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -7 మంగళవారం 2 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01


Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# గుడిసెలు లేని గూడేలే లక్ష్యం



**కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కొరారి గ్రామంలో పైలాన్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

- ఆదివాసీలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఏడాదిలో లక్ష ఇండ్లకు గృహప్రవేశాలు చేసుకున్నాం
- గుడిసెలు లేని గూడేలే లక్ష్యం
- ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా 21 వేల ఇండ్లు
- సెప్టెంబర్ 17న మరో లక్ష ఇండ్ల గృహప్రవేశం
- రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం





**కాగజ్‌నగర్/ఆసిఫాబాద్‌జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
"ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో ముందుకు నడిపించాలన్నదే మా ప్రయత్నం. ఇక్కడ గిరిజన, ఆదివాసీ బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేయాలనేదే మా ఆలోచన. పేదలకు పక్కా ఇండ్లు ఇవ్వాలని అడవి బిడ్డలు వచ్చి నన్ను కోరారు. వెంటనే నియోజకవర్గానికి **మిగతా 2లో..**

# జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు.

- దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ద్వైవార్షిక ఎన్నికలు
- బీహార్, కర్ణాటకలో శాసనమండలి స్థానాలకు కూడా ఎన్నికలు
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 27 రాజ్యసభ స్థానాలు, మూడు రాష్ట్రాల్లోని శాసనమండలి స్థానాల భర్తీకి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్లు దాఖలు చేయడానికి జూన్ 8 చివరి తేదీ. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడాని **మిగతా 2లో...**






## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ

# నీట్-కు సుప్రీం నో !

- నీట్ రీ-టెస్ట్‌ను కంప్యూటర్ విధానంలో నిర్వహించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- జూన్ 21న ఓఎంఆర్ పద్ధతిలోనే పరీక్ష యథాతథంగా జరుగుతుందని స్పష్టం
- ఈ దశలో మార్పులు చేయడం నిర్వహణాపరంగా కష్టమని కోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
ప్రస్తుతమున్న పెన్ను పేపర్ తరహాలో బదులుగా కంప్యూటర్ బేస్డ్ తరహాలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఆదేశించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ దశలో పరీక్ష నిర్వహణా తీరును మార్చడం వల్ల ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. పేపర్ లీకయిందనే ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యుజి 2026 పరీక్షను మే 12న దేశవ్యాప్తంగా రద్దు చేశారు. సిబిఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టింది. **మిగతా 2లో...**

# నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ప్రతి ఒక్కరిపైనా నిఘా
- అదనపు బలగాల మోహరింపు
- పోలీసులకు సహకరించాలన్న సీపీ బి.సుమతి

**జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ 13వ రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. సికింద్రాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్స్‌లో **మిగతా 2లో..**




# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

**: టాపర్‌గా శుభమ్ కుమార్,**

**అమ్మాయిల్లో అరోహి దేశ్‌పాండే ఫస్ట్**

- జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలను విడుదల చేసిన ఐఐటీ రూర్కీ
- మొత్తం 1.8 లక్షల మంది పరీక్ష రాయగా 56,000 మందికి పైగా అర్హత
- అర్హత సాధించిన వారికి జోసా కౌన్సెలింగ్ ద్వారా ఐఐటీలలో ప్రవేశాలు



**న్యూఢిల్లీ జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ ఆశావహులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ ఈ ఫలితాలను ప్రకటించింది. **మిగతా 2లో...**

## ఉద్యోగుల బదిలీలపై

# నిషేధం

**ప్రత్యేక సందర్భాల్లో మినహాయింపు**

**-ఉత్తర్వులు విడుదల**




# పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ...

- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు జనసేన సభకు అనుమతి నిరాకరణ
- పార్కింగ్ సమస్యను కూడా ఓ కారణంగా చూపి కార్యక్రమానికి బ్రేకులు
- ప్రభుత్వ నిర్ణయం అర్థరహితమంటూ జనసేన పార్టీ తీవ్ర ఆగ్రహం
- నిత్యం కార్యక్రమాలు జరిగే చోట తమకే ఎందుకు అడ్డంకులని ప్రశ్న
- కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అనుమతి ఇవ్వలేదని పార్టీ ఆరోపణ

**హైదరాబాద్ జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో పవన్ కల్యాణ్ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ'కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై జనసేన పార్టీ తీవ్రంగా స్పందించింది. **మిగతా 2లో...**



## అమెరికాతో చర్చలకు

# ఇరాన్ బ్రేక్

**లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులే ఇందుకు కారణం**

- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఇరాన్ ఆరోపణ
- పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని హెచ్చరిక



## ప్రతికూల శక్తుల నుంచి

# రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు**



# గుడిసెలు లేని గూడేలే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

3500 ఇండ్లతో పాటు ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా 21 వేల ఇండ్లు మంజూరు చేశాం. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడదలచుకున్నా. ఇండ్లు లేని వారి లిస్టు తయారు చేసి మాకు ఇవ్వండి. ఇండ్లు ఇచ్చే బాధ్యత మాది. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి గిరిజన గూడేల్లో ఇండ్లు మంజూరు చేస్తాం. ఆదిలాబాద్ జిల్లాలోని గూడేల్లో ఒక్క గుడిసె కూడా కనిపించొద్దు.. గూడేల్లో అవసరమైన ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. ఇందిరమ్మ బిల్లుల విడుదలలో ఒక్క రోజు కూడా జాప్యం చేయలేదు. ఏడాదిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు చేసుకున్నాం. 2026 సెప్టెంబరు 17న మరో లక్ష ఇండ్లకు గృహ ప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశిస్తున్నా. రెండో విడతలో భాగంగా మరో 2.50 లక్షల ఇండ్లకు శ్రీకారం చుట్టాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం ప్రజా పాలన– ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు కొరారి గ్రామంలో పైలాన్‌ను ఆవిష్కరించి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధి కారులు, లబ్దిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు చేపట్టారు.

అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లా డుతూ..



తమ ప్రభుత్వంలో మొట్టమొదటి ప్రాధాన్యత ఆదిలాబాద్‌కు ఇస్తామని పీసీసీ అధ్యక్షుడిగా ఆనాడే చెప్పానని, ఆదివాసీ గూడేలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తమ ప్రభుత్వం భావించిందని అన్నారు. రాష్ట్రంలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇండ్లతోపాటు గూడేల కోసం అదనంగా ఇండ్లు మంజూరు చేశామన్నారు. గూడేల కోసం ప్రత్యేకంగా 21 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఈ ఏడాదిలో రాష్ట్రంలో లక్ష మంది ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్నామని అన్నారు. వచ్చే ఏడాది ఇదే తారీఖున అన్ని గూడేల్లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిం చుకుని పండుగ చేసుకుందామన్నారు. గూడేల్లో ఇండ్లు లేని పేదలను గుర్తించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని మంత్రి పొంగులేటికి సూచిస్తున్నామని తెలిపారు. పాత ఇందిరమ్మ ఇండ్లకు గోడలు బాగున్నా పైకప్పు పాడై కొందరు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి స్లాబ్ వేసు కునేందుకు అదనంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సభకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షత వహించారు.



**రూ.112.14 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుతోపాటు ఆసిఫాబాద్‌లో మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కౌటాలలో కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. చింతలమనేపల్లి, గుడ్లబోరి, సిర్‌పూర్ కాగజ్ నగర్ లోని కాపువాడలో, సిర్పూర్(టి) మండలం చింతకుంటలో, కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్‌లో కెవి సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

# జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 11 వరకు గడువు ఉంటుంది. జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు.ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల్లో మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

ఇక శాసనమండలి ఎన్నికల విషయానికొస్తే, బీహార్‌లో 9, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది.

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ నీట్-కు సుప్రీం నో !

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 21న తాజా విచారణ జరగాల్సి వుంది. పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ తిరస్కరించింది. జులై వరకు ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆర్‌జెడి ఎంఎల్ఎ సుధాకర్ సింగ్ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించింది. సిబిటి తరహాలో పరీక్ష నిర్వహిస్తే పేపర్ లీక్ అయ్యే సమస్య తలెత్తదని పిటిషనర్ వాదించారు. ఇంత తక్కువ కాల వ్యవధిలో పరీక్షను మళ్లీ నిర్వహించడంలో వుండే ఇబ్బందులను ప్రస్తావిస్తూ, వారికి వుండే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని సిబిటి లాంటి అంశాలను తోసిపుచ్చినట్లు బెంచ్ తెలిపింది. పేపర్ లీకయినప్పటికీ మళ్లీ పెన్ను పేపర్ తరహాలోనే పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారా అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించగా, పరీక్షల నిర్వహణా అధికారులు ఎదుర్కొనే రవాణా పరమైన ఇబ్బందులను కూడా బెంచ్ ప్రస్తావించింది. అయినా పిటిషనర్ పట్టుబడుతుండడంతో తక్షణమే ఈ అంశాన్ని విచారించలేమని కోర్టు తెలిపింది. కోర్టు పాక్షిక పని దినాలు ముగిసిన తర్వాత దీనిని విచారణకు పెట్టాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల తర్వాత విచారిద్దామని బెంచ్ తెలిపింది. ఎన్‌టిఎ పనితీరులో, పోటీ పరీక్షల నిర్వహణలో విస్తృత సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలై, పెండింగ్‌లో వున్న పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను కూడా కలిపారు.

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ...

ప్రభుత్వ చర్య పూర్తిగా అర్థరహితమని, రాజకీయ దురుద్దేశంతోనే తమ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని పార్టీ వర్గాలు ఆరోపించాయి.వివరాల్లోకి వెళితే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ – జనసేన సాధక్ సమ్మేళనం' పేరిట ఓ ఇండోర్ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2000 మంది పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం తలపెట్టారు. రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పాత్ర, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.అయితే, పార్కింగ్ సమస్యను కారణంగా చూపుతూ ప్రభుత్వం ఈ సభకు అనుమతి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని జనసేన తీవ్రంగా తప్పుబట్టింది. నిత్యం ఎన్నో సాంస్కృతిక, రాజకీయ, కార్పొరేట్ సమావేశాలు జరిగే సంధ్య కన్వెన్షన్‌లో, కేవలం తమ కార్యక్రమానికే పార్కింగ్ సమస్యను కారణంగా చూపడం సహేతుకం కాదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల వివాదం ముగిసిపోయిన అధ్యాయమని, ఆయనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని జనసేన గుర్తుచేసింది. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఉండబోవని స్వయంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారని వెల్లడించింది. అయినప్పటికీ, ఆ వ్యవహారాన్ని సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలవగా, అమ్మాయిల విభాగంలో అరోహి దేశ్‌పాండే అత్యధిక ర్యాంకును సాధించారు.

కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో శుభమ్ కుమార్ 360 మార్కులకు గాను 330 మార్కులు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో ఐఐటీ ఢిల్లీ జోన్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. శుభమ్ కుమార్ తర్వాత, అదే జోన్‌కు చెందిన కబీర్ చిల్లార్, జతైన్ చాహర్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి తమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ఈసారి దేశవ్యాప్తంగా కోటా కోచింగ్ సెంటర్ల ఖ్యాతి మరోసారి పెరిగింది. శుభమ్ కుమార్ ప్రదర్శనతో కోటా మరోసారి ఐఐటీ–జేఈఈ శిక్షణలో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

**విజయంపై టాపర్, కుటుంబ సభ్యుల స్పందన**

తన విజయంపై శుభమ్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. "ఈ ప్రయాణం చాలా సంతృప్తినిచ్చింది. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించడం చాలా ఉత్సాహంగా, సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఈ పరీక్ష రాసే ఆశావహులందరికీ నేను చెప్పేది ఒక్కటే.. కఠోర శ్రమ, పట్టుదలతో స్థిరంగా చదవాలి," అని మీడియాకు తెలిపారు.శుభమ్ విజయం పట్ల అతని తల్లిదండ్రులు గర్వంగా స్పందించారు. అతని తల్లి కంచన్ మాట్లాడుతూ, "శుభమ్ మొదటి నుంచి చాలా కష్టపడి చదివేవాడు. అతని ప్రిపరేషన్ సమయంలో టీచర్లు ఎంతో సహకరించారు. వాడు జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్‌గా నిలిచినందుకు మేము గర్వపడుతున్నాం. అతని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది," అని అన్నారు. శుభమ్ తండ్రి కూడా స్పందిస్తూ, "ఇది మాకు చాలా పెద్ద విజయం. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ కోసం నా కొడుకు చాలా కష్టపడ్డాడు. చదువులో ఎప్పుడూ అంకితభావంతో, శ్రద్ధగా ఉండేవాడు," అని తన ఆనందాన్ని పంచుకున్నారు.

**పరీక్ష గణాంకాలు, తదుపరి ప్రక్రియ**

అధికారిక డేటా ప్రకారం, జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 కోసం 1,87,389 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, మే 17న జరిగిన రెండు పేపర్లకు 1,79,694 మంది హాజరయ్యారు. వీరిలో 56,880 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అర్హత పొందిన వారిలో 10,107 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ పరీక్ష దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఒకే రోజు రెండు సెషన్లలో జరిగింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పేపర్ 2 నిర్వహించారు.

అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక జేఈఈ అడ్వాన్స్‌డ్ పోర్టల్‌లో చూసుకోవచ్చు. తమ రిజిస్ట్రేషన్ లేదా రోల్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఉపయోగించి లాగిన్ అయి స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అడ్మిషన్, కౌన్సెలింగ్ ప్రక్రియలో స్కోర్‌కార్డ్ ప్రింటెడ్ కాపీ అవసరం కాబట్టి, దానిని భద్రపరుచుకోవాలని సలహా ఇచ్చారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జీశాూాా) నిర్వహించే కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాల్గొంటారు. ఈ స్కోర్ ఆధారంగా ఐఐటీ బాంబే, ఢిల్లీ, మద్రాస్, కాన్పూర్, ఖరగ్‌పూర్, రూర్కీ, గౌహతి వంటి దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలలో అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. అర్హత సాధించని విద్యార్థులు నిరాశ చెందకుండా ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర ప్రముఖ ప్రభుత్వ ఇంజినీరింగ్ సంస్థలలో ప్రవేశాలకు ప్రయత్నించవచ్చు.

# నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మొదటిపేజీ తరువాయి**

ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, వీఐపీలు, వీవీ ఐపీలు, ప్రముఖులతోపాటు నగరవాసులు పాల్గొంటున్నారు. దాంతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుమారు 1140 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సివిల్ విభాగం నుంచి 507, ట్రాఫిక్ విభాగం నుంచి 358, సీఎస్‌డబ్ల్యు, ఏఆర్, టీజీఎస్‌పీతోపాటు అదనపు బలగాలను మోహరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ముగ్గురు డీసీపీలు, నలుగురు అదనపు డీసీపీలు, 8 మంది ఏసీపీలు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తారని మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి తెలిపారు. 49 మంది సీఐలు, 88 సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 723 మంది పోలీస్ సిబ్బందితోపాటు ఎస్‌వోటీ, అక్టోపస్ బృందాలు, ఎస్‌బీ, ఐటీ సెల్ బృందాలు పనిచేస్తామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ బృందాలను రంగంలోకి దించామన్నారు. డాగ్‌స్క్వాడ్స్, బాంబ్ స్క్వాడ్స్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. మారుణాయుధాలు, ప్రమాదాలకు ఆస్కారం కల్గిన వాటిని లోనికి అనుమతించబోమన్నారు. ప్రతి ఒక్కరిపైనా నిఘా ఉంటుందని, అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, నగర వాసులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. పాసులున్న వారు పోలీసులు సూచించిన విధంగా పార్కింగ్ ఏరియాలో వాహనాలను పార్క్ చేసి లోనికి వెళ్లాలని కోరారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

# అమెరికాతో చర్చలకు ఇరాన్ బ్రేక్

**న్యూఢిల్లీ జూన్ 1(జర్నలిస్ట్ వార్త):**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులను తీవ్రతరం చేయడంతో, అమెరికాతో జరుపుతున్న చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ప్రాథమిక ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న సందేశాల మార్పిడికి బ్రేక్ వేసింది. ఈ విషయాన్ని ఇరాన్‌కు చెందిన తస్నిమ్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది.లెబనాన్‌లో ఇజ్రాయెల్ నేరాలు కొనసాగిస్తుండటమే తమ నిర్ణయానికి కారణమని ఇరాన్ స్పష్టం చేసింది. "కాల్పుల విరమణకు లెబనాన్‌పై దాడులు చేయకూడదన్నది కూడా ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ లెబనాన్‌తో సహా అన్ని అంశాల్లోనూ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా జరుగుతున్న చర్చలను, సందేశాల మార్పిడిని ఇరాన్ చర్చల బృందం నిలిపివేస్తుంది" అని తస్నిమ్ నివేదిక పేర్కొంది.ఈ పరిణామంపై అంతకుముందు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ తీవ్రంగా స్పందించారు. ఇజ్రాయెల్ దాడులకు తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాలకు వర్తిస్తుందని, ఏ ఒక్కచోట ఉల్లంఘన జరిగినా, అది అన్నిచోట్లా జరిగినట్టేనని వ్యాఖ్యానించారు. దీని పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని అరాఘ్చీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

అమెరికాతో చర్చల్లో దేశ ప్రతినిధిగా ఉన్న ఘలీబాఫ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం విధించడం, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు చేయడం ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రతి చర్యకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఆయన హెచ్చరించారు.

# ఉద్యోగుల బదిలీలపై నిషేధం

## ప్రత్యేక సందర్భాల్లో మినహాయింపు -ఉత్తర్వులు విడుదల

**హైదరాబాద్ జూన్ 1(జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు (జీఓ నెంబర్ 57ను) విడుదల చేశారు. గతంలో మే 1 నుంచి మే 31 వరకు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం సడలించిన విషయం తెలిసిందే. ఆ గడువు ముగియడంతో ఈనెల ఒకటి నుంచి మళ్లీ పూర్తి స్థాయిలో బదిలీలపై నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే ప్రత్యేక సందర్భాల్లో మినహాయి ంపులుంటాయని తెలిపింది. పదోన్నతుల కారణంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు మాత్రమే పోస్టింగ్‌లు ఇవ్వొచ్చని సూచించింది. అయితే ఇతర ఉద్యోగులకు స్థానచల నం కలిగించకుండా ఉన్న ఖాళీల్లోనే నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. పోస్టుల రద్దు, రివర్షన్‌లు, రిపాట్రియేషన్‌లు, విదేశీ సేవల నుంచి తిరిగి రావడం, క్రమశిక్షణా చర్యల నేపథ్యంలో ఉద్యోగుల పోస్టింగ్‌లు అవసరమైతే వాటిని కూడా ఖాళీ పోస్టుల్లోనే చేపట్టాలని పేర్కొం ది. ఆరు నెలలకు మించి దీర్ఘకాలిక సెలవుల నుంచి తిరిగి విధుల్లో చేరే ఉద్యోగులకు కూడా ఖాళీగా ఉన్న పోస్టుల్లోనే నియామకాలు ఇవ్వాలని ఉత్తర్వు ల్లో స్పష్టం చేసింది. సెలవు కారణంగా ఏర్పడిన ఖాళీ లను బదిలీల ద్వారా భర్తీ చేయరాదని పేర్కొంది.

**ఆరు నెలల పాటు సడలింపులకు అవకాశం లేదు**

ఈనెల ఒకటి నుంచి ప్రారంభమయ్యే ఆరు నెలల కాలానికి బదిలీల నిషేధంపై ఎలాంటి సడలింపు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోబోదని ఉత్తర్వుల్లో తెలిపింది. ఆ తర్వాత ఏవైనా మినహాయింపులు ఇవ్వాల్సి వస్తే సంబంధిత పరిపాలనా శాఖలు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతులతో మాత్రమే ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. ఖాళీల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి పరిపాలనా అవసరాల దృష్ట్యా ఖాళీలను భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు, ప్రస్తుత కార్యాలయంలో కనీసం ఒక ఏడాది సేవ పూర్తి చేసిన ఉద్యోగులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేసింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జీతాల బిల్లులు నిలిపివేత**

ఉత్తర్వులకు విరుద్ధంగా చేపట్టిన బదిలీలకు సంబంధించిన ఉద్యోగుల జీతాల బిల్లులను ట్రెజరీలు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలు ఆమోదించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని శాఖలు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కోరింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం లేదు.

# ప్రతికూల శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్‌జూన్ 1(జర్నలిస్ట్ వార్త):**



రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ మేరకు కేసీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని హెచ్చరించారు. ప్రతీప శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని తెలిపారు. తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోవాలనీ, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కోరారు.

## సమాచార హక్కు చట్టం బలోపేతానికి కృషి చేస్తా: మణిదీప్



**భీమదేవరపల్లి/జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):** సమాచార హక్కు చట్టం ప్రచారం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేస్తున్న యువ సామాజిక కార్యకర్త రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించింది. హనుమకొండ జిల్లా సమాచార హక్కు సాధన కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆయనను రాష్ట్ర కమిటీ నియమించింది. భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రంగు మణిదీప్ గతంలో జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థ కార్యక్రమాల విస్తరణకు విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ జిల్లా ఉపాధ్యక్ష పదవిని అప్పగించింది. ఈ సందర్భంగా రంగు మణిదీప్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి పదోన్నతి కల్పించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాచార హక్కు చట్టం బలోపేతం, ప్రజల్లో అవగాహన పెంపు కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించడంతో గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు, స్నేహితులు, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## బస్సు సర్వీసుల పునరుద్ధరణకు కడియం చొరవ చూపాలి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 1:( జర్నలిస్ట్ వార్త)** హనుమకొండధర్మసాగర్కొమురవెల్లి మీదుగా జూబ్లీ బస్ స్టేషన్ వరకు గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించడంతో పాటు జనగాంహుజూరాబాద్ లేదా స్టేషన్ ఘనపూర్హుజూరాబాద్ మధ్య జాతీయ రహదారి మార్గంలో కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సామాజిక కార్యకర్త కొలిపాక రవీందర్ కోరారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా హసన్‌పర్తిలోని కిట్స్, అన్నసాగరంలోని ఎస్ఆర్ యూనివర్సిటీ, జనగాం ప్రాంతంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ప్రాంతానికి చెందిన అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు.వీరిలో విద్యార్థినులే ఎక్కువగా ఉండటంతో భద్రతా కారణాల దృష్ట్యా తల్లిదండ్రులు హైదరాబాద్‌కు పంపకుండా సమీప విద్యాసంస్థలను ఎంచుకుంటున్నారని చెప్పారు. అయితే బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ మార్గంలో బస్‌బేలు నిర్మాణం పూర్తయినందున బస్సులు నడిపేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రయోజనాలు గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులకు పూర్తిస్థాయిలో అందాలంటే ఈ రూట్లలో బస్సులు నడపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తే వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత అధికారులతో చర్చించి బస్సు సర్వీసుల పునరుద్ధరణతో పాటు కొత్త సర్వీసుల మంజూరుకు చర్యలు చేపట్టాలని రవీందర్ విజ్ఞప్తి చేశారు.

# వేలేరు-హైదరాబాద్‌కు కొత్త ఎక్స్‌ప్రెస్

### జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**వేలేరు/హనుమకొండ బ్యూరో, జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల చిరకాల డిమాండ్‌కు స్పందిస్తూ వేలేరు నుంచి హైదరాబాద్‌కు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. వేలేరు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జెండా ఊపి బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కొత్త సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు వేలేరు నుంచి బయలుదేరే బస్సు కమ్మరిపేట, బండతండా, నారాయణగిరి, ముప్పారం, సాయిపేట, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, కరుణాపురం మీదుగా ప్రయాణించి ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు.తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 8 గంటలకు వేలేరు చేరుకుంటుందని తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ద్వారా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళలు ప్రభుత్వ ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఈ సర్వీస్‌ను సైతం వినియోగించుకోవచ్చన్నారు.జూన్ 2 నుంచి వేలేరు వరకు వచ్చే బస్సులను గొల్లకిష్టంపల్లి వరకు పొడిగించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. బస్సు సర్వీస్ సజావుగా నడిచేలా ప్రజలు, ప్రయాణికులు, గ్రామాల నాయకులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్, వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయిపేటకు రూ.15 లక్షల డ్రైనేజీ వరం

### ఆకస్మిక పర్యటనలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ -గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్న ఎమ్మెల్యే





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామంలో నెలకొన్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు.గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సైడ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని గ్రామ సర్పంచ్‌కు సూచించారు. డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.15 లక్షలు మంజూరు చేస్తానని, పనులను అత్యంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మురుగు నీటి సమస్య తొలగిపోవడంతో పాటు రహదారి పరిశుభ్రంగా మారుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై మాట్లాడిన ఎమ్మెల్యే, ఇప్పటికే సాయిపేట గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం మంజూరైందని తెలిపారు. అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అర్హులైన పేద కుటుంబాలకు త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సాయిపేట అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హామీలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ తమ సమస్యలను నేరుగా తెలుసుకుని స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి నాగరాజు, ఉప సర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల కలలు నెరవేరాయా?

## తెలంగాణ ఆవిర్భావం నుంచి అభివృద్ధి ప్రస్థానం వరకు...

జూన్ 2... తెలంగాణ ప్రజల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన రోజు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, వందలాది మంది అమరవీరుల బలిదానాల ఫలితంగా 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమం కేవలం రాజకీయ ఉద్యమం కాదు. అది ఆత్మగౌరవం కోసం, స్వయంపాలన కోసం, సమాన అవకాశాల కోసం, నీళ్లునిధులునియామకాల కోసం సాగిన ప్రజా ఉద్యమం.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో ఒక ప్రశ్న సహజంగానే ముందుకు వస్తోంది. ఉద్యమ సమయంలో ప్రజలు కలగన్న తెలంగాణ నేడు సాకారమైందా? అమరవీరులు ఆశించిన తెలంగాణ ఇదేనా? ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉన్నాయి.తెలంగాణ ఉద్యమంలో ప్రధానంగా వినిపించిన నినాదం "నీళ్లు, నిధులు, నియామకాలు". రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగునీటి రంగంలో భారీ ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. ఎన్నో ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాలు విస్తరించాయి. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఒకప్పుడు వలసలకు వెళ్లిన కొన్ని ప్రాంతాల్లో పరిస్థితులు మారాయి.నిధుల విషయంలో తెలంగాణ తన ఆర్థిక సామర్థ్యాన్ని




పెంచుకుంటూ దేశంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన నిలిచే ప్రయత్నం చేసింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని ఐటీ, ఫార్మా, పారిశ్రామిక రంగాలు మరింత విస్తరించాయి. రాష్ట్ర ఆదాయం పెరిగింది. మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.అయితే నియామకాల విషయంలో మాత్రం నిరుద్యోగ యువతలో ఇంకా అసంతృప్తి కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలు చేపట్టినప్పటికీ ఉద్యమ సమయంలో ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించలేదనే విమర్శలు ఉన్నాయి. పోటీ పరీక్షల నిర్వహణలో ఎదురైన సమస్యలు, ఖాళీల భర్తీలో జాప్యం వంటి అంశాలు యువతలో ఆందోళనకు కారణమయ్యాయి.తెలంగాణ ఉద్యమం అంటే కేవలం రాజకీయ నాయకుల పోరాటం మాత్రమే కాదు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కళాకారులు, మేధావులు, మహిళలు, జర్నలిస్టులు సహా సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాగిన మహోద్యమం. ఈ ఉద్యమంలో వందలాది మంది యువకులు తమ ప్రాణాలను అర్పించారు. అలాంటి అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ప్రభుత్వం అందించిన సహాయం ఉన్నప్పటికీ, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు దక్కిందా అనే చర్చ ఇప్పటికీ కొనసాగుతోంది.తెలంగాణ ఏర్పాటుతో భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ యాస నేడు గర్వకారణంగా మారింది. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిలిచాయి. ఇది ఉద్యమం సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి.అయితే తెలంగాణ ఉద్యమం లక్ష్యం కేవలం ప్రత్యేక రాష్ట్రం సాధించడమే కాదు. సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు చేరడం, యువతకు ఉపాధి కల్పించడం, రైతుకు భరోసా ఇవ్వడం, సామాజిక న్యాయాన్ని స్థాపించడం కూడా ఉద్యమ ఆశయాల్లో భాగమే. ఆ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరినప్పుడే అమరవీరుల త్యాగాలకు నిజమైన అర్థం లభిస్తుంది.ప్రతి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం విజయాలను సంబరంగా జరుపుకోవడంతో పాటు ఆత్మపరిశీలనకు కూడా ఒక అవకాశమే. రాష్ట్రం ఎంత అభివృద్ధి సాధించింది? ఇంకా ఏం చేయాలి? ఉద్యమ ఆశయాల సాధనలో ఎంతదూరం వచ్చాం? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతికే రోజు కూడా.తెలంగాణ సాధన ఒక చారిత్రక విజయం. కానీ అమరవీరులు కలగన్న సమగ్ర తెలంగాణ నిర్మాణం ఇంకా కొనసాగుతున్న ప్రక్రియ. ఆ కలలను పూర్తిగా సాకారం చేయడమే తెలంగాణ సమాజం ముందున్న అసలు సవాలు.ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటం ముగిసింది... కానీ అమరవీరుల ఆశయాల సాధన కోసం తెలంగాణ ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉంది.



సీనియర్ జర్నలిస్ట్కొట్టే సుధాకర్ (లెనిన్)
హనుమకొండ జిల్లాజిల్లా కార్యవర్గ భ్యులు
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్
సెల్: 9908401581

RNI NO: TELTEL/2023/87607

# విధిరాతను జయించి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి

## అంధత్వాన్ని అధిగమించిన మల్లిక విజయగాథ విద్యార్థులకు స్ఫూర్తి

**ముదిగొండ, /జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):**
కళ్లలో వెలుగు లేకపోయినా.. మనసులో లక్ష్యం ఉంటే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముదిగొండ నూతన ప్రిన్సిపాల్ ఎస్. మల్లిక నిరూపించారు. పుట్టుకతోనే అంధురాలైన ఆమె బ్రెయిలీ లిపి ద్వారా విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కాకుండా, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రిన్సిపాల్ హోదాను అందుకోవడం పలువురికి స్ఫూర్తిగా నిలిచింది. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో ఎస్. మల్లిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముదిగొండ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను ముదిగొండ ఎంపీడీవో విజయ ఘనంగా సన్మానించారు. శారీరక వైకల్యం విజయానికి అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని మల్లిక జీవితమే చెబుతోందని ఎంపీడీవో అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాధాన్యంపై వక్తలు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేలకొండపల్లి అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో డాక్టరేట్ పొందిన



అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందుతున్నదని తెలిపారు. అత్యాధునిక ప్రయోగశాలలు, బాలురు, బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముదిగొండ సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రజల మద్దతు అవసరమని అన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో విజయ, సర్పంచ్ ఉపేందర్‌లను అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విధి చూపును హరించినా.. పట్టుదలను హరించలేకపోయింది. అంధత్వాన్ని జయించి ప్రిన్సిపాల్‌గా ఎదిగిన మల్లిక జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.“

# ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



**తల్లాడ,/ జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జగన్నాథపురం గ్రామానికి చెందిన మేడ వెంకయ్య ద్విచక్ర వాహనంపై వెంకటగిరి క్రాస్‌రోడ్డు నుంచి తల్లాడ వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో సత్తుపల్లి నుంచి తల్లాడకు వస్తున్న సత్తుపల్లి డిపో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి అతని బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకయ్య రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# ఎండల నుంచి ఉపశమనం

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**తల్లాడ,/ జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని అంజనాపురం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలకు సోమవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండుతున్న ఎండల నేపథ్యంలో కూలీల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమోలు వీరనారాయణరావు కుమారుడు గోపాలరావు, ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పనిస్థలాల వద్దకు వెళ్లి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఎండాకాలంలో శారీరక శ్రమ చేసే కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణయ్య, శ్రీనివాసరావు, కిన్నెర వెంకటేశ్వర్లు, సాయినేని ప్రసాద్, హనుమంతరావు, రామారావు, అంకోలు రామజోగయ్య, గోపి గోపాలరావు, పాలవెల్లి హైమావతి, అంకోలు రామారావు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# మండల పురుషుల సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి





**ఎల్కతుర్తి,/ జూన్ 1 (జర్నలిస్ట్ వార్త)** ఎల్కతుర్తి మండల పురుషుల సంఘం సమితి అధ్యక్షుడిగా గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జనగాని సుభాష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల సంఘాల ప్రతినిధులు, సభ్యులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై సభ్యులు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. సంఘ అభివృద్ధితో పాటు మండలంలోని అన్ని సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. సభ్యుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటానన్నారు.
నూతన కమిటీ ఏర్పాటుతో మండల పురుషుల సంఘం కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగుతాయని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాల్వలో చెత్త తొలగింపు..

## సమస్యకు తాత్కాలిక ఉపశమనం



**దామెర,/ జూన్ 1( జర్నలిస్ట్ వార్త)**ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామం ఒడ్డెర కాలనీ సమీపంలోని మురికి కాల్వలో పెద్ద ఎత్తున చెత్తాచెదారం, డ్రైనేజీ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా గ్రామ ఉపసర్పంచ్ మద్దె కుమార్ స్పందించి చర్యలు చేపట్టారు. పంచాయతీ సిబ్బంది, జేసీబీ సహాయంతో కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాల్వల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి నిల్వలు ఏర్పడి దోమలు, దుర్వాసనతో పాటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే గ్రామంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని, ప్రజలు కూడా చెత్తను కాల్వల్లో వేయకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడికి నివాళులర్పించిన పార్టీ నేతలు



**పాలేరు/, జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):** నేలకొండపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు అరెకట్ల కొండలరావు వియ్యంకులు జానకిరామయ్య దశదిన కార్యక్రమం ఆదివారం ఆయన స్వగ్రామమైన బుద్దారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి టీడీపీ నాయకులు కార్యక్రమానికి హాజరై జానకిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జానకిరామయ్య పార్టీ అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కొండబాల కరుణాకర్, వనమా వాసు, నాగార్జున శ్రీనివాస్, తెలుగు మహిళ నాయకురాలు చుండూరు రాజరాజేశ్వరి, నల్లమాస మల్లయ్య, నేలకొండపల్లి ఉపసర్పంచ్ మద్దినేని మహేష్, కొల్లు హరీష్, రాయల కోటేశ్వరరావు, నల్లమోతు సత్యనారాయణ, కర్ణాటి అశ్వనీకుమార్, పావులూరి వెంకటేశ్వర్లు, మల్లెంపాటి లహరిన్, తాటికొండ నాగేశ్వరరావు, బోయిన వెంకన్న, పరిటాల నాగార్జున తదితరులు పాల్గొన్నారు. నాయకుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# గ్రామ దీపికల దీక్షకు జాక్, ధర్మ సమాజ్ పార్టీ సంఘీభావం

## గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచాలని డిమాండ్

**తల్లాడ,/ జూన్ 1 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామ దీపికలకు కనీస గౌరవ వేతనం రూ. 20 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గత పది రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన వారు గ్రామ దీపికల సమస్యలను అడిగి తెలుసుకుని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు మేడి బసవయ్య మహారాజ్ మాట్లాడుతూ, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని



ఆరోపించారు. గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరో నాయకుడు శివన్ మహారాజ్ మాగంటి మాట్లాడుతూ, విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారం లభించినప్పుడే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మండల నాయకులు కిన్నెర శివకృష్ణ, తాళ్లూరి రాజా తదితరులు పాల్గొన్నారు. గ్రామ దీపికల సమస్యలపై ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న దీక్షకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి మద్దతు పెరుగుతుండటంతో గ్రామ దీపికల పోరాటం మరింత బలపడుతోంది.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.

**బయ్యారం/,జూన్ 1.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం సంతులాల్ పోడు తండా గ్రామపంచాయతిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. అర్హులైన నిరుపేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.
ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దీపిక,హౌసింగ్ డిఈ రాజన్న,ఏఈ ప్రియాంక,సర్పంచ్ గుగులోత్ మణి,సీఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబు,సెక్రటరీ కుటుంబరావు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితం..

## -కల్పన సునీల్ నాయక్.

**బయ్యారం/,జూన్ 1.(జర్నలిస్ట్ వార్త)**
మండల ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకురాలు అజ్మీరా కల్పన సునీల్ నాయక్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకొన్నారు. యువకులు,ఉద్యోగుల త్యాగాలు, కెసిఆర్ ఉద్యమ పోరాటం,నిరాహార దీక్ష ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని ఆమె పేర్కొన్నారు.



## దివంగత మునిగాల మొగిలి చిత్రపటానికి మార్నేని రవీందర్ రావు నివాళి



**ఐనవోలు/జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో సోమవారం విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానిక మునిగాల రాజు, సమ్మయ్యల తండ్రి దివంగత మునిగాల మొగిలి దశదిన కర్మ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మొగిలి చిత్రపటానికి పూలమాల వేసి భావోద్వేగంతో ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్, మాజీ సర్పంచ్ జన్న కుమార్ స్వామి, వాకిటి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ మల్లేశం, స్వామి, రాయుడు, రాజు, వెంకన్న తదితర ముఖ్య నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి.

### పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.



**బయ్యారం/,జూన్ 1.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం గ్రామపంచాయతీ 7వ వార్డు సభ్యురాలు ఎట్టి సరీత తండ్రి బచ్చలి వెంకన్న(50) వడదెబ్బతో సోమవారం మృతి చెందారు.వారి భౌతికకాయాన్ని బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు,బయ్యారం టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు శీలం సరోజన,బట్టు ఉమాదేవి,పెద్దినేని శాంత,బానోత్ సునీత,నందగిరి భద్రయ్య,తాటి జనార్ధన్,కంకటి నారాయణ,పులి మల్లయ్య,ఆకునూరి సూర్యనారాయణ,రామగిరి వెంకటేశ్వర్లు,నందిపాటి బవాణి,రిటైర్డ్ ఆర్మీ తుపాకుల సతీష్,కాసం ఉప్పల్ రెడ్డి, నిమ్మల సోమిరెడ్డి, పందిరి విద్యాసాగర్,తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు.

### -ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి.

**బయ్యారం,జూన్ 1.(జర్నలిస్ట్ వార్త)**
నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను వీరస్వామి స్మరించుకున్నారు.ఏళ్లకేళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు,ఆలోచనల మేరకు సోనియాగాంధీ రాష్ట్ర ప్రజల చిరకాల కోరికను తీర్చారని ఈ సందర్భంగా వీరస్వామి గుర్తుచేశారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా పోలీసులకు పతకాలు

**విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్‌కు సర్వోన్నత పోలీసు పతకం**

**భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు శౌర్య పతకాలు**

**16 మందికి మహోన్నత సేవా పతకాలు**

**జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సేవలు అందించిన 632 మంది పోలీసులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు వారి పేర్లను ప్రకటించింది. విశిష్ట, అత్యుత్తమ మరియు ఉత్తమ సేవలకు గుర్తింపుగా, పోలీస్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక బ్యూరో, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక సేవల విభాగాలకు చెందిన సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేశారు.తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు తెలంగాణ పోలీస్ శౌర్య పతకాలను ప్రకటించారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురిని శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.



## నల్లబెల్లిలో ఘనంగా బిర్రు నాన్సీ జన్మదిన వేడుకలు











**వర్ధన్నపేట/జూన్ 1(జర్నలిస్ట్ వార్త);**
దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ (ఎంఎస్పీ) రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ కుమార్తె బిర్రు నాన్సీ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలోని వారి స్వగృహంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, నాయకుల సమక్షంలో నాన్సీ కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.
ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు బిర్రు బాబు, జర్నలిస్ట్ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు మరిపట్ల ప్రశాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు బిర్రు యాకయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు బిర్రు ప్రభాకర్ మాదిగ, రమేష్, గణపాక హరీష్, గోలి రాజు తదితరులు హాజరై బాలికకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామానికి చెందిన చిన్నపిల్లలు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.







